# స్వప్న

-మంత్రవాది మహేశ్వర్

సాయంకాలం అయిదు దాటినా వాతావరణం చాలా వేడిగా వుంది. దానికి తోడు కరెంటు కోత మూలంగా మహా వుక్కగానూ వుంది.

లోపలి గదిలోంచి వరండాలోకొచ్చి పడక్కుర్చీలో కూర్చుని మేగజైన్ తిరగేస్తున్నాడు ప్రసాద్. భార్య ప్రభావతి కూడా వూర్లో లేదు. చెల్లెలు పెళ్ళికని విశాఖపట్నం వెళ్ళింది.

ముందు పక్క ఖాళీ స్థలంలో ఎండ వేడికి వాడిపోయినట్టున్న మొక్కలవైపు చూశాడు. రాములు వచ్చే వేళయింది. వాడు వస్తేనే వాటి దాహం తీరుతుంది. లేకపోతే వాటి పని అంతే. ఎవరూ పట్టించుకోరు. సాధారణంగా రాములు రాకపోవడం అనేది జరగదు. పనిలోకి రాగానే వాడు చేసే మొదటి పని మొక్కలకు నీళ్ళు పోయడం.



వెళ్ళేముందు ప్రభావతి చాలా కచ్చితంగా చెప్తనే చెప్పింది. మొక్కల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వూరుకునేది లేదని! ఆమె ఎంతో ప్రేమతో వాటిని పెంచుకుంటోంది.

ఎవరైనా బంధువులు, స్నేహితులు పిల్లలు వస్తే ప్రభావతి వారితో మాట్లాడుతూనే వున్నా మన సంతా ఆ మొక్కల మీదనే వుంటుంది వారెక్కడ పాడుచేస్తారో అని. పిల్లలు లేకపోవవడంతో బోలె డంత తీరిక.. బహుశా ఆ లోటును ఈరకంగా మొక్కలతో తీర్చుకుంటుందేమో ప్రభావతి. పిచ్చి ప్రభావతి.

ఎన్నో ఏళ్ళుగా చెప్పాలనుకుంటున్నాడు ప్రసాద్. కానీ ధైర్యం చాలడంలేదు.

చేసిన పాపం చెబితే పోయినా, పోకపోయినా తన గుండె తేలికపడుతుంది. ఇప్పటికి ఎన్నిసార్లు చెప్పాలని ప్రయత్నమో!

కానీ..

ఏదో బెరుకు తనని వెనుకడుగు వేయిస్తోంది.

సాయంకాలం వేడిగా వీస్తున్న గాలి ప్రసాద్ ఆలోచనలతో సమానంగా ఇబ్బంది పెడుతోంది.

'ఆమె' గుర్తొచ్చినప్పుడు మనసు ఇక్కడుండనని మారాం చేస్తోంది.

అది తన సొంత విషయం.

గుండెలో గుప్తంగా దాగిన జ్ఞాపకం..అనుభూతి.

యవ్వనంలోకి అడుగుబెట్టిన అమ్మాయిలు- అంటే సుమారు పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళు వస్తున్న అందమైన అమ్మాయిలు కనిపిస్తే 'ఆమె' గుర్తొస్తుంది.

వాళ్ళంతా 'ఆమె' లాంటి వాళ్ళయి వుంటారా?

ఏమో!

అయినా అదంతా అప్రస్తుతం.

కటక్‌లో అన్నయ్య దగ్గరుండి ఎం.ఏ. చదివే రోజులవి.

చదువు తప్పితే మరో ధ్యాస లేని రోజులు.

అన్నయ్య, బామ్మ..-ఇదే బయటి ప్రపంచం. బామ్మతో ఎన్ని కబుర్లో వాళ్ళ గురించి, వీళ్ళ గురించి.

'ఆమె' గురించి..అదే 'స్వప్న' గురించి.

నిజమే!

స్వ-ప్న- కటక్‌లో తెలుగమ్మాయి.

ఎలక్ట్రిసిటీ బోర్డులో డివిజనల్ ఇంజనీర్ గారి అమ్మాయి - స్వప్న.

పక్క మేడ మీదలోనే..వుండేది.

పద్దెనిమిదేళ్ళ స్వప్న తరచు తమ ఇంటికి వస్తుండేది. మామ్మతో కబుర్లు చెప్పేది.

కబుర్లు, నవ్వులు.. మనిషి ఎంత అందంగా వుంటుందో అంతకంటే అందంగా నవ్వుతుంది.

స్వప్న, ప్రసాద్‌ల మధ్య అదో రకమైన ఆకర్షణ చిగురేసింది.

స్వప్న వుండగా తను వచ్చినట్టయితే చాలు.. తక్కున సిగ్గుపడి వెళ్ళిపోయేది.

ఎక్కువగా తను లేని సమయాల్లోనే ఆమె వచ్చేది.

స్వప్న..ఒక మెరుపుతీగ.

** ** ** ** ఒకరోజున తను అన్నాడు..

"బామ్మా..ఎందుకు స్వప్న అంత సిగ్గుపడుతుంది?"

బామ్మ నవ్వుతూనే వుండి పోయింది తప్ప జవాబివ్వలేదు. నవ్వులోనే జవాబుంది కాబోలు.

ఒకసారి..

స్వప్న లోపలికి వస్తుండడం, తను బయటకు వెళ్ళిపోతుండడం సంభవించేది.

తను 'ఎక్స్‌క్యూజ్‌మీ' అనడంతో-

ఆమె పెద్దపెద్ద కళ్ళు అలాగే నిలిచిపోయేవి కాసేపు.

అందంగా మెరిసేవి..మెరిసే ఆ కళ్ళలో తన రూపం చూసుకోవడం..

ఆమె నవ్వు నవ్వడం..

'తను ఏదైనా మాట్లాడితే'- అన్న ఆలోచనను ఆచరణలో పెట్టేలోపల ఆమె పరుగుపరుగున వెళ్ళిపోవడం..లేడి పిల్లలా.

ఇలా ఎన్నిసార్లో.

** ** ** ** ఆ రోజున మధ్యాహ్నం 'టెలిగ్రాం' రావడంతో బామ్మ అర్జెంటుగా విజయవాడ వెళ్ళిపోయింది.

మరునాడు,

తను పడక్కుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు.

తలుపు కొట్టిన చప్పుడు.

అన్నయ్యా?..అయి వుండడే- ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళాడు. వెళ్ళి తలుపు తీశాడు.

స్వ...ప్న...

చూడగానే అదో రకం బెరుకు..భయం..కాళ్ళలో చలి.

ఒకో సమయంలో ఆడపిల్లలకే కాదు—మగవాళ్ళకు కూడా ఈ మూడు లక్షణాలు కలుగుతాయేమో?

"లోపలికి రమ్మనరా?? స్వప్నే చొరవ తీసుకొని అంది.

"బామ్మ లేదు. ఊరెళ్ళింది".

'నాకు తెలుసు'.

"మరి?"

తరువాతేం చెప్పాలో, ఏం చేయాలో తెలియని అయోమయంలో పడిపోయిన క్షణంలోంచి తేరుకునేంతలో స్వప్న తలుపు వేసేసింది..లోపలికెళ్ళి కూర్చుంది కుర్చీలో.

కుర్చీలో కూర్చోమంది అతన్నీ-

కబుర్లు..

నిజం చెప్పాలంటే స్వప్న బామ్మని కలవడానికి రాలేదు.

తనే చొరవ తీసుకొని టీ చేసింది- తను మొహమాటపడుతున్నటికీ..

ఆమె దగ్గరగా వచ్చి ఎలా కూర్చుందో..

ఆమె చేతులు అతడిని ఎలా స్పృశించాయో..

ఆ స్పర్శకు కలిగిన మైకంలో కళ్ళు ఎలా మూతలు పడ్డాయో..శరీరాలు దగ్గరై ఒకటవ్వాలని ఎంతగా తల్లడిల్లాయో.

పదే పదే ముద్దులు కోరుకున్న ఆమె లేత పెదాలు..మైకంలో మెలికలు తిరిగిన నాజూకైన శరీరం.

ఒంపుసొంపులను వెతికి వెతికి తాకిన తన చేతులు.

తట్టుకోలేక తను ఆమెను అక్కడున్న మంచం మీద పడుకోబెట్టాడు.

ఆమె అన్నీ రకాలుగానూ అతని మగతనాన్ని రెచ్చగొట్టింది.

ఆమె చేతి వేళ్ళు అతని ఛాతీపై కదిలాయి.

అతని ఆత్మ నిగ్రహం ఏమైందో ఏమో?

ఒక్కటయ్యారు..

అంతే!

** ** ** ** మళ్ళీ ఆ విశాల నేత్రాలు కళ్ళముందు కనిపిస్తున్నట్టుంది.

కదిలించేస్తున్నట్టే వుంది.

కానీ ఆ తరువాత ఆమె కనపడలేదు.

ట్రాన్స్‌ఫరైన తండ్రితో పాటు ఆమె వెళ్ళిపోయింది.

స్వ..ప్న..స్వప్న సుందరిగానే మిగిలింది.

అసలు అదంతా నిజంగా జరిగిందా? లేక ఓ తీయని వూహా? అనిపిస్తుంటుంది తనకు.

ఏ అమ్మాయయినా అలా చేయగలుగుతుందా?

అంత జరిగినా ఏం జరగనట్టు స్వప్న ఎలా వుండగలిగింది?

మౌనంగా ఎందుకుండిపోయింది?

స్వప్నకంటే వయసులో తనే పెద్ద. తనకే ఎక్కువ ఆత్మనిగ్రహం వుండాలి. ఆలోచన వుండాలి. చేస్తున్నదేమిటో తెలియాలి.

తను పెళ్ళిచేసుకునేవాడే.

జరిగిన 'తప్పు'ను తొందరపాటు చర్యగా పెళ్ళికి ముందు జరిగిన తప్పటడుగుగా చేయాలనుకున్నాడు.

అయినా, ఆడపిల్ల జీవితంతో ఆడుకునే మనిషి కాదు తను. ఎం.ఏ. పూర్తి కావడం, వెంటనే ఉద్యోగం రావడం చకచకా జరిగిపోయాయి. స్వప్నను పెళ్ళి చేసుకొని సుఖంగా వుండవచ్చుననుకున్నాడు.

ఒకసారి బామ్మతో 'స్వప్నను పెళ్ళి చేసుకుంటాను' అని మనసులోని కోరికను వెలిబుచ్చాడు.

బామ్మ నవ్వింది.

"నువ్వు అన్ని విషయాల్లోనూ ఆలస్యమే..పోయి నేడే ఆ అమ్మాయికి పెళ్ళయింది",

అది వినగానే నిర్ఘాంతపోయాడు తను.

స్వ..ప్న.. స్వప్నే కాదు అసలు ఏ అమ్మాయైనా ఎలా పెళ్ళి చేసుకోగలుగుతుంది? అలాంటి పరిస్థితి తర్వాత?

అతనిని కవ్వించి, ఆకర్షించి, తనకు తానుగా తనివి రాస్తి అర్పించి మరొకరిని ఎలా పెళ్ళాడగలిగింది?

ఘోరం..నమ్మలేని నిజం.

ఆతరువాత తనూ ఓ ఇంటివాడయ్యాడు.

ఆ ఏడాది కూడా ఎప్పటిలానే బామ్మను చూడడానికి కటక్ వెళ్ళాడు తను. బామ్మ చెప్పిన మాటకు ఆశ్చర్యపోయాడు. బాధపడ్డాడు కూడా.

పెళ్ళయిన మొదటి ఏడాదిలోనే స్వప్న భర్త యాక్సిడెంటులో చనిపోయాడని.

పెళ్ళయిన ఆర్నెల్ల తరువాత వుట్టిన, ఆర్నెల్ల బాబుతో ఆమె ఎక్కడో ఉద్యోగం చేస్తోందని..

బామ్మింకా ఏవో చెబుతోంది..

అంటే

తన కారణంగా ఆమె ..స్వప్న..

ఆ పసివాడికి తను..

బామ్మ ఏమైనా వూహించగలిగిందా?

లేదు.

ఆ రహస్యం తన గుండెల్లోనే వుంది.

అది ప్రభావతికి చెప్పే మార్గమూ లేదు. అది ఆమెకు తెలిసే అవకాశమూ లేదు. ప్రభావతిని మోసం చేయాలనే ఆలోచనా తనకి లేదు.

గతం చెప్పడం వల్ల ప్రయోజనం లేదు సరికదా ఆమె మనసు కష్టపెట్టినట్టవుతుంది.

అలా ముప్పిరిగొంటున్న ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతుండగా..

ఇంతలో

"బాబుగారూ!" అన్న రాములు పిలుపుతో తను ఈ లోకంలోకి వచ్చాడు.

గేటు గడియ తీశాడు.

మొక్కలకు నీళ్ళు పోస్తూ, ఎండుటాకుల్ని పక్కకు తోస్తూ పనిలో నిమగ్నమై వున్నాడు రాములు.

నిశ్శబ్దం భరించలేక రాములుతో మాట్లాడాలనిపించింది.

"రాములూ! నీది పెద్ద సంసారమా?"

"లేదు బాబూ ఒక్కడే కొడుకు"

"మరి నీ భార్య!"

గాఢంగా నిట్టూర్చుతూ చెప్పాడు రాములు

"భార్యా? ఆమె ఎప్పుడో వదిలి వెళ్ళిపోయింది".

"అంటే చనిపోయిందా?"

"లేదు..బ్రతికే వుంది. ఇంకొకడితో లేచి వెళ్ళిపోయింది.

"నువ్వేలా వూరుకున్నావు చూస్తూ..వదిలేశావా అలాగ!"

"చూడండి బాబు గారూ! ఏ చదువూ లేని నేను అంతకంటే ఏం చేయగలను చెప్పండి? వెళ్ళాలనుకునే వారిని ఆపడం దేనికి? మన దగ్గరుంటే మనది. లేకుంటే వదిలేయడమే! ఎగిరిపోనివ్వడమే!"

దానికి జవాబేం ఇవ్వలేదు తను.

ఎండ వేడి బాగా తగ్గింది.

మొక్కలకు నీళ్ళుపోస్తున్నాడు రాములు.

మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి.

నిజమే!

స్వప్నకేం కారణాలున్నాయో?

అందుకే

గుండె లోని ఆ రహస్యం రహస్యంగానే వుండాలి.

●